కంటి పరీక్షల పరిశీలన



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న అజయ్‌ కుమార్‌

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కొండాపూర్‌ జిల్లా ఆస్పత్రిలో చేపడుతున్న కంటి పరీక్షలను వైద్య విధాన పరిషత్‌ కమిషనర్‌ డాక్టర్‌ అజయ్‌కుమార్‌ పరిశీలించారు. శనివారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన విద్యార్థులకు చేస్తున్న ఆర్‌బీఎస్‌కె కంటి పరీక్షల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. చిన్నారులకు వేస్తున్న వ్యాక్సిన్లు, మందుల కొరత తదితర వివరాలపై ఆరా తీశారు. 1149 మందికి కంటి పరీక్షలు చేయాల్సి ఉండగా 419 మందికి చేశారు. మార్చి 15వ తేదీ వరకు కంటి పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ డాక్టర్‌ అనురాగిని రెడ్డి, డాక్టర్లు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్లు



ప్రత్యేక కౌంటర్‌లో ఫిర్యాదు స్వీకరిస్తున్న మోహన్‌రెడ్డి

చందానగర్‌: శేరిలింగంపల్లి, చందానగర్‌ జంట సర్కిళ్లలో ఆస్తిపన్ను సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కౌంటర్లను శనివారం కమిషనర్లు ముకుంద్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్తి పన్ను విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న, పునఃసమీక్షా అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్‌ కలెక్టర్ల ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్‌ బకాయిలు సరి చేయడం, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్‌ఎస్‌ సమస్యలు స్వయం మూల్యాంకనం, తదితర సమస్యలు ప్రత్యేక కౌంటర్లలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెల 22 నుంచి మార్చి 31 వరకు ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

జర్మనీకి భారతదేశం అతిపెద్ద మార్కెట్‌

రాయదుర్గం: జర్మనీ వంటి దేశానికి భారతదేశం అతిపెద్ద మార్కెట్‌ అని ఇంటర్నేషనల్‌ స్టార్టప్‌ ఫౌండేషన్‌ కన్వీనర్‌ డాక్టర్‌ జేఏ చౌదరి పేర్కొన్నారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్‌ ప్రాంగణంలో ఇంపాక్ట్‌ హబ్‌–హైదరాబాద్‌, ఇంటర్నేషనల్‌ స్టార్టప్‌ ఫెస్టివల్‌, కార్ల్‌రూహే సంస్థల ఆధ్వర్యంలో ఇండో–జర్మన్‌ వ్యూహాత్మక సహకార ఒప్పంద కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లోని స్టార్టప్‌ సంస్థలకు ఇంపాక్ట్‌ హబ్‌ హైదరాబాద్‌ సహకారంతో జర్మనీ, యూరోప్‌ ప్రాంతాలలో తమ ఉత్పత్తుల విక్రయాలకు అవకాశం కలుగుతుందన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

పటాన్‌చెరు టౌన్‌: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్‌పై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...ఇంటరాక్టివ్‌ ఫ్లాట్‌ ప్యానెల్‌పై ఇస్తున్న శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధించగలుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు రాజేశ్వరరావు నాయక్‌, పీపీ రాథోడ్‌, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం స్పందన, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: కలెక్టర్‌ క్రాంతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్‌ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌, జూనియర్‌ కళాశాల, ఉస్మాన్‌నగర్‌లోని కస్తూర్బా బాలికల పాఠశాలలను శనివారం సాయంత్రం కలెక్టర్‌ క్రాంతి తనిఖీ చేశారు. పాఠశాలలోని కిచెన్‌ షెడ్డు, స్టోర్‌ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి పదికి పది జీపీఏ వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

విద్యార్థుల ఫిర్యాదు

వెలిమెలలో ప్రభుత్వ మోడల్‌ స్కూల్‌ ఆవరణలోని హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్‌ క్రాంతికి భోజనం సరిగా ఉండటంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తమకు భోజనం సరిగా ఇవ్వడం లేదని, కూరలో నీళ్లు ఎక్కువగా ఉంటున్నాయని తెలిపారు. దీంతో నిర్వాహకులపై కలెక్టర్‌ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల్లో పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యానం.. అధ్వానం



ధ్వంసమైన క్రీడా పరికరాలు



విరిగిపోయిన బల్లలు

పార్కు అంటేనే పచ్చదనంతో కళకళలాడుతూ చిన్నారులు ఆడుకునేందుకు ఆటవస్తువులు, యువకులకు ఓపెన్‌ జిమ్‌లు తదితర సౌకర్యాలతో ఉండాలి. కానీ మియాపూర్‌లోని న్యూ ప్రశాంత్‌నగర్‌ పార్కు మాత్రం ఇందుకు భిన్నంగా దర్శనమిస్తుంది. ఎండిపోయిన చెట్లు, విరిగిపోయిన బెంచీలు, ధ్వంసమైన క్రీడాపరికరాలతో కళావిహీనంగా మారింది. ప్రతి ఏడాది రూ. లక్షల్లో ఖర్చుచేస్తున్నా పార్కు అభివృద్ధి మాత్రం ముందుకు సాగడం లేదని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్కుపై పర్యవేక్షణ కరువై విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు.సంబంధిత అధికారులు స్పందించి కళావిహీనంగా మారిన పార్కులో మౌలిక వసతులు కల్పించి పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు చేపట్టాలని సందర్శకులు, స్థానికులు కోరుతున్నారు.

–మియాపూర్‌





పార్కులో ఎండిపోతున్న చెట్లు, పేరుకు పోతున్న చెత్త

శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



పనుల శంకుస్థాపనలో పాల్గొన్న గాంధీ, గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్గదర్శకంలో శేరిలింగంపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మోహర్‌ పార్కుకాలనీలో రూ.14.80 లక్షలు, నేతాజీ నగర్‌, రూ.20 లక్షలు, గోపన్‌పల్లి–సీపీఆర్‌బెల్లావిస్టా నుంచి నల్లగండ్ల ప్రధాన రహదారికి రూ.49 లక్షలతో ఉన్న రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులకు శనివారం ఆయన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని పనులు చేస్తున్నామన్నారు. కాలనీలు, బస్తీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రధాన రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, థీమ్‌పార్కులు, మంచినీటి సరఫరా మెరుగుపర్చడం వంటి పనులను చేపట్టామని గుర్తు చేశారు. కాలనీలు, బస్తీలలో అంతర్గత రోడ్లన్నీ దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తున్నామని రెండేళ్లలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ.. శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

చందానగర్‌ : మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గోకుల్‌ ప్లాట్స్‌ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించి మాట్లాడారు. గోకుల్‌ ప్లాట్స్‌లో రూ.48.50 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఎమ్మెల్యే వెంట శ్రీనివాస్‌ యాదవ్‌, సాంబశివరావు, గుమ్మడి శ్రీనివాస్‌, సాంబయ్య, పూర్ణ ఉన్నారు.

ట్రేడ్‌ లైసెన్స్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



అధికారులతో చర్చిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి

చందానగర్‌ : వ్యాపారులు తమ ట్రేడ్‌ లైసెన్స్‌ల కోసం ఆన్‌లైన్‌ దరఖాస్తులు చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చందానగర్‌ సర్కిల్‌–21 ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయంలో ట్రేడ్‌ లైసెన్స్‌ విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, మీ సేవా కేంద్రాల ద్వారా పునరుద్ధరించుకోవాలని, ఇప్పటి వరకు ట్రేడ్‌ లైసెన్స్‌ పొందని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రేడ్‌ లైసెన్స్‌ 2024 డిసెంబర్‌ 31తో ముగిసిందని, కొత్తగా జనవరి 31లోపు రెన్యూవల్‌ చేసుకోలేని లేకుంటే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ సమావేశంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవి, అసిస్టెంట్‌ లైసెన్స్‌ అధికారి కృష్ణ, నరేందర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, ఎస్‌ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

నాట్యం.. శోభితం



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం తిల్లాన ఆర్ట్స్‌ అకాడమీ నాట్య గురువు మాధవి మార్నేళ్లపూడి శిష్య బృందం చే ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. గణపతి కౌతం, జతిస్వరం, ఇందరికి భయం ఇచ్చు చేయి, మల్లారి, తిల్లాన తదితర అంశాలను కళాకారులు ఆరాధ్య, స్వర, వీరింద, దియా, శ్రీనిక, లోహిత, వేదశ్రీ, ఇషితా, సన్నిది, సహస్ర ప్రదర్శించి ఆకట్టుకున్నారు. –మాదాపూర్‌

పైపులైన్‌ పనులను పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పైపులైన్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్‌ శ్రీనివాసరావు, అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: పైపులైన్‌ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కేపీహెచ్‌బీకాలనీలోని ఇందూ విల్లాస్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ డివిజన్‌ కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. ఇందూ విల్లాస్‌ వద్ద స్టాామ్‌ వాటర్‌కి సంబంధించిన నూతన పైపు లైన్‌ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి ఇబ్బంది ఉన్నా తనను సంప్రదించాలన్నారు. అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడకుండా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సాయిబాబా చౌదరి, రాజేష్‌, డీఈ శంకర్‌, ఏఈ సాయిప్రసాద్‌, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ మేనేజర్‌ శ్రీకాంత్‌ రెడ్డి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మౌనిక

చందానగర్‌ : ఓ మహిళ అదృశ్యమైన ఘటన చందానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చందానగర్‌ పాపిరెడ్డి కాలనీ చెందిన మౌనిక (26) గచ్చిబౌలిలో ప్రైవేట్‌ సంస్థలో ఉద్యోగం చేస్తుంది. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన భర్త సాయివెంకట్‌ గౌడ్‌ మౌనికకు ఫోన్‌ చేయగా బస్సులో వస్తున్నానని తెలిపింది. ఎంత సేపటికీ రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రెండో అంతస్తు నుంచి పడి వ్యక్తి మృతి

మియాపూర్‌: రెండో అంతస్తు నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్సై మాణిక్యం వివరాల ప్రకారం...భద్రాదికొత్తగూడం ఇల్లందు గ్రామానికి చెందిన బి.రాజు(32) ఈ నెల 6న మియాపూర్‌ ఆల్విన్‌ కాలనీలోని ప్రజాసిటీ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న బంధువు ఠాకూర్‌ రాజేశ్వర్‌సింగ్‌కు ఓ పార్సల్‌ ఇచ్చేందుకు వచ్చి ఆ రోజు రాజేశ్వర్‌సింగ్‌ ఇంటివద్దనే ఉండిపోయాడు. రాజుకు మద్యం తాగే అలవాటు ఉండడంతో ఆ రోజు రాత్రి మద్యం తాగాడు. అందరూ నిద్రపోయిన తర్వాత మ ద్యం మత్తులో రెండో అంతస్తులోకి వెళ్లి కాలుజా రి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

హుందాగా ప్రవర్తించాలి: ఎస్పీ

పటాన్‌చెరు టౌన్‌: పనిచేసే చోట మహిళా సిబ్బందితో మర్యాదగా, హుందాగా నడుచుకోవాలని, ఇతరుల వట్ల గౌరవం ముందు మన నుంచే ప్రారంభం కావాలని జిల్లా ఎస్పీ రూపేశ్‌ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం, రుద్రారం గీతం ఇంజనీరింగ్‌ కళాశాలలో 'ఫైనాన్షియల్‌ మేనేజ్‌మెంట్‌, పనిచేసే చోట మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పనిచేసే చోట మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించే వారికి నూతన చట్టాల ప్రకారం కఠిన శిక్షలు పడతాయన్నారు. అత్యాశకు పోయి డబ్బులు రెట్టింపు అవుతాయని అడ్డదారుల్లో సంపాదించేందుకు ప్రయత్నించకూడదని హితవు పలికారు. అవసరాల రీత్యా మాత్రమే రుణాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవరావ్‌, అడ్మినిస్ట్రేటివ్‌ అధికారి కల్యాణి, డీఎస్పీలు రవీందర్‌రెడ్డి, సత్తయ్యగౌడ్‌, రామ్మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, జిల్లా సీఐలు, ఎస్‌ఐలు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్‌

మణికొండ: బీఆర్‌ఎస్‌ పార్టీ తరపున గత మున్సిపల్‌ ఎన్నికల్లో గెలుపొంది పూర్తి కాలం అందులోనే కొనసాగిన మాజీ కౌన్సిలర్‌ శనివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. మణికొండ మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన వసంతరావు చౌహాన్‌ గతంలో ఎమ్మెల్యే సమక్షంలోనే బీఆర్‌ఎస్‌ పార్టీలో పనిచేశారు. ఇటీవల ఎమ్మెల్యే పార్టీ మారినా అతను అందులోనే కొనసాగాడు. శనివారం ఎమ్మెల్యేతో కాంగ్రెస్‌ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ టి. మల్లేష్‌, నాయకులు కె.రామకృష్ణారెడ్డి, యాలాల నరేష్‌, సురేష్‌గౌడ్‌, బి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించిన కచేరీ ఆకట్టుకుంది. గణేశపంచరత్న, చూడరమ్మ సతులారా, భోపాళి రాగం, అదివో అల్లదివో, అమృత వర్షిణిరాగం, పిడికిట తలంబ్రాల, జగడపు చనువుల జాతర, బహుళ ప్రాచూర్యం పొందిన అన్నమయ్య సంకీర్తలను కళాకారులు ఆలపించారు. సితార శిష్య బృందం శారద, నిర్మలశ్రీ, రిషిక, రవితేజ, నందిత, కాత్యాయని, శ్రీదేవి, సితారతో సంవిధ, తబలాపై రమణమూర్తి, జగన్‌దత్తు, స్వాతి, మనోజ్‌ మోహంటి సంగీత సహకారాన్ని అందించారు.

కళాకారులకు అవగాహన



మాదాపూర్‌: మాదాపూర్‌లోని తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శనివారం అధ్యక్షురాలు జీవీ వెన్నెల తెలంగాణ సాంస్కృతిక సారథి మహిళా కళాకారులకు వివిధ అంశాలపై మహిళా చైతన్య పేరిట అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటివేషనల్‌ స్పీకర్‌ గంప నాగేశ్వర్‌ రావు కళాకారులకు అమూల్యమైన సందేశాలు ఇచ్చారు. వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న 150 మంది కళాకారులకు ఉచిత నేత్ర, గైనకాలజీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల, పాఠశాల భవనం

రాయదుర్గం: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో ప్రవేశాల కోసం నిర్వహించే 'కామన్‌ ఎంట్రెన్స్‌ టెస్ట్‌–2025' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 2025–26 విద్యా సంవత్సరంలో గురుకులాలలో ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతానికి ఆనుకొని ఉండే గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల/పాఠశాల, బాలుర కళాశాల(టీజీఎస్‌ఆర్‌జేసీ–బీ–నీట్‌,ప్రెప్‌ అకాడమీ)ల్లో ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. ముఖ్యంగా 5వ తరగతిలో ప్రవేశాలు, అంతేకాకుండా 6,7,8,9వ తరగతుల్లో ప్రస్తుతం ఖాళీ ఉండే సీట్ల కోసం కూడా పరీక్షను ఒకేసారి నిర్వహించడంతో ఏర్పాట్లు భారీగా చేస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఫోన్‌ ద్వారా పరీక్షా కేంద్రాలకు చేరుకునే వివరాలను కూడా అధికారులు, ఉద్యోగులు అందించారు. పరీక్షా కేంద్రంలో సౌకర్యాల కల్పనపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. పరీక్షా సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.

దాతల సహకారం అభినందనీయం

పటాన్‌చెరు టౌన్‌: దాతల సహకారం అభినందనీయమని ప్రిన్సిపాల్‌ నవనీత అన్నారు. శనివారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి మహాత్మాజ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఇస్నాపూర్‌ మున్సిపాలిటీ పరిధి పాశమైలారానికి చెందిన జె.కె ఫెన్నర్‌ పరిశ్రమ ఆర్వోప్లాంట్‌ను ఏర్పాటు చేసి, విద్యార్థులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ యాజమాన్యానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ మేనేజర్‌ శ్రీవెంకట్‌నాయుడు, డిప్యూటీ మేనేజర్‌ దుర్గాప్రసాద్‌, సిబ్బంది, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీలు రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం

- నీలం మధు



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు: కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీ కులగణన దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్‌ నేత నీలం మధు సీఎం రేవంత్‌ రెడ్డిని కోరారు. శనివారం ప్రజాభవన్‌లో సీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశానికి మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో వినతిపత్రం అందజేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో బిల్లుపెట్టే అంశం, సంక్షేమ పథకాలపై చర్చించారు. అలాగే, ప్రత్యేకంగా మరొకసారి స్పెషల్‌ కులగణన డ్రైవ్‌ను ఏర్పాటు చేసిన విషయంపై మాట్లాడారు. సమావేశానికి హాజరైన పలువురు బీసీ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ముదిరాజ్‌ల చిరకాలంగా డిమాండ్‌ అయిన బీసీ–డీ నుంచి బీసీ–ఏ లోకి చేర్చాలని ముఖ్యమంత్రిని కోరారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ.. యావత్‌ దేశం అబ్బురపడేలా నిర్ణయం తీసుకున్న రేవంత్‌ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలో చట్టబద్ధత తర్వాత అన్ని వర్గాలకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌ చైర్మన్లు, బీసీ ముఖ్యనాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలేషియా టౌన్‌షిప్‌ సమస్యలు పరిష్కరిస్తా



కాలనీ వాసులతో పరిసరాలను పరిశీలిస్తున్న జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ తదితరులు

కూకట్‌పల్లి: మలేషియా టౌన్‌షిప్‌ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌ అన్నారు. శనివారం స్థానికులతో కలిసి సమస్యలను పరిశీలించారు. మలేషియా టౌన్‌షిప్‌ పరిసర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, టౌన్‌షిప్‌ పక్కనే ఉన్న పార్కులో సీనియర్‌ సిటిజన్స్‌ ప్రవేశానికి రుసుం వసూలుపై కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ గతంలో కాలనీ వాసులతో కలిసి జోనల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ వాసులతో జోనల్‌ కమిషనర్‌ మాట్లాడారు. పార్కును పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనులను వెంటనే ప్రారంభించారు.